క్లుప్తంగా

నేడు స్పందన

కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. స్పందనలో గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రజలు అర్జీలను దరఖాస్తు చేసుకోవచ్చని వీటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తారని తహసీల్దార్ పేర్కొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడం, పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పాలు, పొంగళ్లతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



పెనుగంచిప్రోలు: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల రక్షణ చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని జాతీయ రహదారిపై అర్ధరాత్రి దాటిన తరువాత నడిచే వహనాలను ఆపి కళ్లు కడుక్కునేందుకు నీళ్లు ఇవ్వటంతో పాటు టీ అందజేస్తున్నారు. నిద్ర మత్తు వదిలిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరి ప్రసాద్ మాట్లాడుతూ రాత్రుళ్లు వాహనదారులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. వాహనాలు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలప కూడదన్నారు.

ఏపీ డెయిరీ మాజీ డైరెక్టర్ మృతి



కంచికచర్ల: ఉమ్మడి ఏపీ డెయిరీ మాజీ డైరెక్టర్, విజయ డెయిరీ మాజీ జనరల్ మేనేజర్ వేమా రాఘవరావు(82) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు.. రాఘవరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. పరామర్శించిన వారిలో సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మాడుగుల శంకర్, కొత్తా కోటేశ్వరరావు, మార్త శ్రీనివాసరావు తదితరులున్నారు.

నేడు జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ

ఇబ్రహీంపట్నం: మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమం విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 17వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఎన్టీటీపీఎస్ పాతగేటు వద్ద సోమవారం జరుగుతుందని ఆసంఘం బ్రాంచి అధ్యక్షుడు సీహెచ్ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని విగ్రహం ఆవిష్కరిస్తారు. అనంతరం యూనియన్ రాష్ట్ర మహాసభ జరుగుతుంది.

తూనికలు, కొలతల అధికారుల దాడి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో తూనికలు, కొలతల అధికారులు మాంసం దుకాణాలపై ఆదివారం ఆకస్మికంగా దాడి చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో పట్టణంలోని మటన్, చికెన్ దుకాణాల్లో కటాలు, రాళ్ల పరిమాణాన్ని తనిఖీ చేశారు. కొండపల్లిలో అనేక దుకాణాలు తనిఖీ చేశామన్నారు. ఎక్కడా కొలతలు, కాటా రాళ్లలో తేడా కనిపించలేదని తెలిపారు. తేడా ఉన్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని షాపుల యజమానులను హెచ్చరించారు.

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

నూజివీడు: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూజివీడు కార్యవర్గం ఎన్నిక ఆదివారం పట్టణంలో నిర్వహించారు. దీనిలో భాగంగా యూనియన్ అధ్యక్షురాలిగా వై.ఆదిలక్ష్మి, కార్యదర్శిగా పి.రాజకుమారి, కోశాధికారిగా కందుల శోభతో పాటు మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి. రాజు తెలిపారు.

రబీ వరి సాగుపై మక్కువ

- ఊపందుకున్న వరి నాట్లు
- పొలాలకు పుష్కలంగా సాగు నీరు
- బోరులు, బావులు, చెరువులకిందసాగు
- ఖరీఫ్ సాగు కలిసిరావడంతో రైతుల్లో ఆనందం



వరి నాట్లు వేస్తున్న కూలీలు

పెనుగంచిప్రోలు: రబీ సీజన్ ముమ్మరంగా సాగుతోంది. వాతావరణం అనుకూలించటంతో పాటు, సాగునీరు పుష్కలంగా లభిస్తుండటంతో వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతులు బోరులు, బావుల కింద ఇప్పటికే నాట్లు వేశారు. అలాగే చెరువులు, మునేరు కాలువలకు కూడా నీరు వస్తుండటంతో రైతులు వేగంగా నాట్లు వేస్తున్నారు.

2,214 హెక్టార్లలో రబీ వరి సాగు..

నియోజకవర్గంలో సుమారుగా 2,214 హెక్టార్లలో రబీ వరి సాగు చేస్తున్నారు. కూలీలకు కూడా ఈ సీజన్‌లో డిమాండ్ బాగా పెరిగింది. ప్రస్తుతం మిర్చి కోతలు, పత్తి తీతలు కూడా ముమ్మరంగా సాగుతుండటంతో కూలీలకు కూడా డిమాండ్ విపరీతంగా పెరిగంది. ఇతర ప్రాంతాల నుంచి కూడా కూలీలను వరి నాట్లు వేసేందుకు రైతులు తీసుకు వస్తున్నారు.

కలిసొచ్చిన ఖరీఫ్..

ఎకరానికి నాట్లు వేసేందుకు గతంలో రూ.2 వేల నుంచి రూ.2,400 అయితే ప్రస్తుతం రూ.3 వేలకు పైగా ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ కూడా రైతులకు బాగా కలిసొచ్చింది. గిట్టుబాటు ధరతో పాటు వర్షాలు సమృద్ధిగా పడటం, ప్రకృతి సహకరించటంతో దిగుబడలు బాగా ఉన్నాయి. దీంతో రెట్టింపు ఉత్సాహంతో రైతులు రబీలో మరింత దిగుబడులు సాధించాలనే ఆశతో ఉన్నారు.

రైతు భరోసాతో ఆనందం..

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రభుత్వం రైతులకు అందించిన రైతు భరోసా వల్ల పెట్టుబడులకు పెద్దగా ఇబ్బంది లేకపోవటంతో రైతులు ఆనందంగా ఉన్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించటంతో పాటు కావాల్సిన విజ్ఞానాన్ని అందిస్తున్నారు.

సూచనలు పాటించాలి



రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలి. విత్తన శుద్ధి వలన రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. మోతాదుకు మించి ఎరువుల వాడకం ఉండకూడదు. రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

-కే.రామసుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారి

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



కృష్ణా డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణరెడ్డిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మైలవరం: స్థానిక బాపూజీ పాఠశాల, వీవీఆర్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కళాశాల పూర్వ విద్యార్థి, కృష్ణా జిల్లా డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం శ్రీబాపూజీ హైస్కూల్, వీవీఆర్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల(మోస్ట్) కార్యాలయాన్ని ఆదివారం శివనారాయణరెడ్డి సందర్శించారు. వీవీఆర్ జూనియర్ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఎన్నో ఉన్నత పదవుల్లో ఉన్నారని చెప్పారు. ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గ్రామాన్ని, చదువుకున్న పాఠశాలను మరువకూడదన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు కార్యదర్శి జూలకంటి ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మన్నె శ్రీనివాస్ శివనారాయణరెడ్డికి చిరుసత్కారం చేశారు.

ఘనంగా ముత్యాల హారతి



గంపలగూడెం భజన మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మునికి విశేష పూజ

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం, భజన మందిరం, గోసవీడు మదనవేణుగోపాలస్వామి ఆలయాల్లో భక్తులు శ్రీకృష్ణ పరమాత్మకు ముత్యాల హారతి జరిపారు. మహిళలు ప్లేట్లలో ముత్యాల దండలు, ప్రమిదలు ఉంచి దీపాలు వెలిగించారు. 14 మందికి దాత సహకారంతో బహుమతులు అందజేశారు.

పెనుగొలనులో అమ్మవారికి సారె

పెనుగొలను రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళల అమ్మవారికి సారె సమర్పించారు. ముందుగా సారె సామగ్రితో మహిళలు గ్రామోత్సవం చేశారు. నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, పెద్దకొమిర వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా చేశారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న గ్రామస్తులు

మైలవరం: రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఆరోగ్య శిబిరం సేవలను స్థానికులు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. మైలవరం నారాయణ స్కూల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విజయవాడ భవానీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, మణిపాల్ ఆస్పత్రుతల్లోని ప్రముఖ వైద్యులు పాల్గొనడం గొప్ప విషయమన్నారు. కార్యదర్శి, కోశాధికారి గూడూరు నాగిరెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి స్త్రీలలో వచ్చే రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లపై అవగాహన కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమని చెప్పారు. శిబిరంలో మెంటార్ వజ్జల బాలాజీ ప్రసాద్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లోని విద్యుత్ శక్తి ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ న్యూ ఇయర్ క్యాలెండర్‌ను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాసరావు, కార్యదర్శి సిద్ధేశ్వరరావు, నాయకులు వీరబాబు, వెంకటరావు, కృష్ణారావు, నాగమల్లేశ్వరరావు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ దొంగలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్ దొంగలు ఇద్దరిని పటమట పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడెక్కడ వాహనాలు, సెల్ ఫోన్‌లను దొంగిలించారో వీరి వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడు

విజయవాడ కల్చరల్: భారతీయుల ప్రత్యక్షదైవం సూర్యభగవానుడని యువ ఆధ్యాత్మికవేత్త గరికపాటి గురజాడ పేర్కొన్నారు. శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించే సాహిత్యంలో సూర్యభగవానుడు ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గరికపాటి గురజాడ మాట్లాడుతూ రామయణం, భారతం, అష్టాదశ పురాణాల్లో సూర్యుని ప్రస్తావన కనిపిస్తుందన్నారు. ప్రాచీన కవులు తమ కావ్యాలలో సూర్యోదయం. సూర్యాస్తమయం వర్ణన కనిపిస్తుందన్నారు. స్యూర్యధ్యానం వల్లనే పాండవులకు అక్షయ పాత్ర లభించిందని పేర్కొన్నారు. ఆదిత్య హృదయం పఠించడం వల్లనే రామాయణంలో శ్రీరామచంద్రునికి విజయం లభించిందన్నారు. కవుల కవితా వస్తువు సూర్యభగవానుడుగా భావించవచ్చన్నారు. సూర్యుని ద్వారా ప్రసారమయ్యే కిరణాల ద్వారా కొన్ని రకాలైన దీర్ఘవ్యాధులు నయం అవుతాయని సైన్స్ చెబుతోందని శివరా మకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ గరికపాటి గురజాడ విశేషాలను వివరించారు. గరిపాటి నరసింహారావు వారసుడిగా అనేక ఆధ్యాత్మిక ప్రసంగాలను చేసి, యువతను ధర్మమార్గం వైపు నడిపిస్తునట్లు తెలిపారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి



తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తీగెల ఆంజనేయులు, గ్రంథాలయాధికారి పద్మావతి తదితరులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళ్లాల్లో ధాన్యపు బస్తాల మాయంపై కేసు

కంచికచర్ల: గుర్తు తెలియని వ్యక్తులు కళ్లాల్లోని ధాన్యం బస్తాలను దొంగిలించడంతో రైతు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శౌరి అమరవరం గ్రామానికి చెందిన రైతు సుబ్బారావు తన పొలంలో పండించిన ధాన్యాన్ని డిసెంబర్ 27వ తేదీన కళ్లంలో ఆరబెట్టి బస్తాల్లో నింపాడు. రాత్రి పొద్దుపోవటంతో తెల్లవారుజామున ఇంటికి తరలిస్తాననుకుని కళ్లంలోనే 24 బస్తాలను వదలి ఇంటికి వెళ్లాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఆ ధాన్యపు బస్తాలను అపహరించుకుపోయారు. చుట్టుపక్కల వెదికినా ఎటువంటి సమాచారం అందలేదు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రంగవల్లుల పోటీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో సంక్రాంతి పండగ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 120 మంది మహిళలు వివిధ రకాల ముగ్గులు తీర్చిదిద్దారు. విద్యార్థుల కోలాహలం మధ్య గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు వేశారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీస్సులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన ముగ్గురు మహిళలకు బహుమతులు అందజేశారు. పాఠశాల జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య, ప్రిన్సిపాల్ వాణీకుమారి, వైస్ ప్రిన్సిపాల్ నాగరత్నం పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): చిన్నారుల చేత గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో పటమట పోలీసులు రెండు రోజుల నుంచి తనిఖీలు చేస్తున్నారు. పటమట డొంక రోడ్డుతో పాటు తోటవారి వీధిలో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. అంతే కాకుండా అనుమానం వచ్చిన వారిని విచారిస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో గ్యాంగ్‌వార్ జరిగింది. ఇందులో ఉన్న పలువురు గంజాయి అమ్ముతున్నట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. పోలీసులు ఈ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

గజగజా వణికిస్తున్న చలి



నందిగామ: స్థానికంగా చలి వణికిస్తోంది. నిన్న మొన్నటి వరకు సాధారణంగా నమోదైన ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. నందిగామలో శనివారం రాత్రి ఉష్ణోగ్రతలు 19.5 నమోదు కాగా పగటి ఉష్ణోగ్రతలు 30.6 గా నమోదయ్యాయి. ఇక ఆదివారం ఒక్కసారిగా చలి పెరిగిపోయింది. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోయి 12.5 నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు 30.6గా నమోదయ్యాయి. ఒక్కరోజు వ్యవధిలో ఏడు డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గడంతో ప్రజలు వణికిపోతున్నారు. మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. చలి పెరగడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

22న యూటీఎఫ్ సమావేశం

నందిగామ: ఈ నెల 22ను యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని వీటిని జయప్రదం చేయాలని సంఘ నేతలు అన్నారు. స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా బాధ్యుల సమావేశం ఆదివారం జరిగింది. సమస్యలు పరిష్కరించాలని నేతలు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్, జిల్లా బాధ్యులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య, మహేశ్వర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మావతినగర్ జంక్షన్ అభివృద్ధికి చర్యలు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను
- రూ.75 లక్షలతో జంక్షన్ అభివృద్ధి



మూడు రోడ్ల కూడలిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ముక్త్యాల రోడ్డులో రోజురోజుకు పెరిగిపోతున్న వాహనాల రద్దీ, రోడ్డు ప్రమాదాలను నిరోధించేందుకు పట్టణంలోని పద్మావతినగర్‌లో రూ.75 లక్షలతో జంక్షన్ అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పద్మావతి నగర్‌లోని జయంతిపురం, ముక్త్యాల, జగ్గయ్యపేట రోడ్‌ల కూడలిని ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఉదయభాను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే పలు చోట్ల రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. అభివృద్ధి చర్యల్లో భాగంగా పద్మావతినగర్‌లో జంక్షన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేసీపీ, ఆల్ట్రాటెక్, రాకెమ్ ఫార్మా, హేమాద్రి తదితర ఫ్యాక్టరీలకు వెళ్లే వాహనాలతో ఈ రహదారి నిత్యం అత్యంత రద్దీగా ఉంటోందన్నారు. ఈ మూడు రోడ్ల కూడలి ఇరుకుగా ఉండటంతో తరచూ ఇదే స్థలంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మూడు రోడ్ల కూడలిని విస్తరించడం వలన ట్రాఫిక్‌ను, ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ, బీసీ విభాగాల అధ్యక్షులు బద్దునాయక్, గుంజ లక్ష్మణ్, నాయకులు తన్నీరు నాగేంద్ర, మల్లెల సాయి, పాటి సాంబ, ఆర్అండ్‌బీ ఏఈ నరేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



శ్రీరంగనాయకస్వామి ఆలయంలో పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

జగ్గయ్యపేట అర్బన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీరంగనాయకస్వామి ఆలయంలో ఆదివారం పుష్పయాగ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త బృందం ఆధ్వర్యంలో 11 రకాల పూలు ఒక్కొక్కరకం పూలు 11 కిలోల చొప్పున వివిధ రకాల పూలతో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో మహాసుదర్శన లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు. పూజా దాతలు హోమ, పుష్పయాగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ బదరీనారాయణ, పెద్ద సంఖ్యలో ప్రముఖులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

హనుమాన్ చాలీసా..

పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న పాత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి సర్టిఫికెట్స్ అందిస్తున్న సిడ్బీ మేనేజర్ శ్రీరామచంద్రమూర్తి

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సిడ్బీ మేనేజర్ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. బెంజిసర్కిల్‌లోని వేదిక కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సిడ్బీ–కోవే స్వావలంబన్ మేళా ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీరామచంద్రమూర్తి మేళాలో స్టాల్స్ ఏర్పాటు చేసిన మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకునేందుకు సిడ్బీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కోవే(కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన స్వావలంబన్ మేళాకు మంచి స్పందన లభించిందన్నారు. కోవే రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక మాట్లాడుతూ కోవే–సిడ్బీ సంయుక్తంగా రానున్న రోజుల్లో మరింత పెద్ద స్థాయిలో ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా మహిళలు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకునేవిధంగా చిన్న వ్యాపార సంస్థల ద్వారా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశం కల్పించడమే కోవే ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ ప్రదర్శనలో 60 స్టాల్స్ ఏర్పాటు చేశామని, ప్రతిస్టాల్ నిర్వాహకులకు సర్టిఫికెట్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోవే జాతీయ జాయింట్ సెక్రటరీ అపర్ణ, ఏపీ శాఖ కార్యదర్శి విజయలక్ష్మి, మోహిని, శ్రావణి, సత్యవతి పాల్గొన్నారు.

క్రమశిక్షణను అలవరచుకోవాలి

ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ అనిల్‌కుమార్



తారక్ రామ్ కాంతారా నృత్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవరచుకోవాలని, అప్పుడే జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని ఆదాయపు పన్ను శాఖ విజయవాడ కమిషనర్ ఎం.అనిల్ కుమార్ చెప్పారు. వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ 44వ వార్షికోత్సవం స్కూల్ ఆవరణలో శనివారం జరిగింది. అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తిని అలవరచుకోవాలన్నారు. చక్కగా చదువుకుని రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. అకాడమీ కోశాధికారి ఎస్. వెంకటేశ్వరరావు, స్కూల్ కన్వీనర్ విష్ణు, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.సీతారామయ్య, స్కూల్ ప్రైమరీ విభాగం హెచ్ఎం సీహెచ్.జయలక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'కాంతారా' నృత్యం

స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా సభ అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యూకేజీ విద్యార్థి ఎస్. తారక్ రామ్ చేసిన కాంతారా చిత్రంలోని నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఆగిరిపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో 1981-82 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

నూజివీడు : ఆగిరిపల్లి హైస్కూల్‌లో 1981–82 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం హైస్కూల్లో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 60మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అవసరంలో ఉన్న మిత్రులకు సాయపడాలని, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు సభ్యులందరూ నిధిని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని నిర్ణయం తీసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, కుటుంబ విషయాలు తెలుసుకున్నారు. ఏటా ఇలాంటి సమ్మేళనాన్ని నిర్వహించుకోవాలని కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com